తుంది! కాని అది జరిగేదా? "ప్రేమలో పడకండి అమ్మాయిలూ జాగ్రత్త" అంటే చెప్పిన వాళ్ళని చూసి హేళనగా నవ్వుకుంటారు—తప్పటడుగు వేస్తారు—ఊబిలో కూరుకుపోతారు—ఎలా వీళ్ళని రక్షించడం!

దారిపొడుగునా సునయన అలా ఆలోచిస్తూనేవుంది!

(వనిత)

★

# జనరేషన్ గ్యాప్

"డోన్ట్ బి సిల్లీ మమ్మీ హౌ డు యు ఎక్స్‌పెక్ట్ మి టు మేరీ ఏన్ అన్ నోన్ గై" నందిత అద్దం ముందు నిలబడి జుత్తు బ్రష్ చేసుకుంటూ. చేత్తో కర్ల్స్ తిప్పుతూ. అద్దంలో అన్ని యాంగిల్స్ నించి అందం చూసుకుంటూ తల్లివంక చూడనైనా చూడకుండా నిర్లక్ష్యంగా కొట్టి పారేసింది. కూతురి ధోరణి మాధవికి కోపం తెప్పించినా కోపం చూపితే యీ కాలం పిల్లలు అందులో అమెరికాలో పెరిగే పిల్లలు అసలు సహించరని తెలుసు కనక తన కోపం దాచుకొని.

"యూ డోన్ట్ బి సిల్లీ నందూ. పెళ్ళికి ముందే తెలియకానికి, పరిచయాలు పెంచుకుని డేటింగులు చేయడానికి, చేసి నచ్చకపోతే వదిలేసి మరోడ్ని వెతుక్కోవడానికి యిది అమెరికాయే అయినా మనం యిండియన్స్ అని మరిచిపోకు. మన అలవాట్లు. ఆచారాలు, సంస్కృతులు వేరని నీకు తెలియదా. యిక్కడున్నా మన ఆచారం ప్రకారం నడవాల్సిందే...." గొంతులో అథారిటీ కన్పించింది.

"ఓ.... డోన్ట్‌టాక్ రబ్బిష్ మమ్మీ ఈ ఆచారాలు, సంస్కృతులు....ఆల్ నాన్సెన్స్.... యూనో దట్ ఐ డోంట్ హెవ్ బిలీఫ్ ఇన్ సచ్ థింగ్స్—మనిషి ఎలాంటివాడో తెలియకుండా ముక్కు మొహం తెలియనివాడిని ఐదునిమిషాలు చూసి పెళ్ళాడాలని ఎలా చెప్తున్నావు....నీవు చదువుకుని మోడర్న్ అయివుండీ....సమ్‌టైమ్స్ యూ టాక్ ఆల్ నాన్‌సెన్స్ మమ్మీ—చూడు నాకెవరన్నా పరిచయం అవాలి. నాకు నచ్చాలి, మా మనసులు కలవాలి, ఐడియాలు, టేస్టులు కలవాలి, యిద్దరి మధ్య అండర్ స్టాండింగ్ కుదరాలి—లవ్ పుట్టాలి అప్పుడుగాని నేను చేసుకోను-మీరు

చూపించిన వాడిని కట్టుకుని మనసులు కలవకపోతే కొట్టుకుంటూ, తిట్టుకుంటూ ఆ టార్చర్ అంతా సహిస్తూ లోకం కోసం కల్సి బతకడం వగైరాలు నేను చచ్చినా చేయను. అంచేత నాకు నచ్చిన వాడు కనిపిస్తే నేనే చెపుతా మీకు" ఖచ్చితంగా అంది.

"ఆ, చూస్తున్నాంగా ఈ డేటింగులు ఎంత సక్సెస్ ఫుల్ అవుతున్నాయో—కలిసి తిరిగి, మనసులే కాక శరీరాలు పెళ్ళి కాక ముందే కలుపుకుని నచ్చలేదని యింకోడిని వెతుక్కోడం, లేదంటే పెళ్ళి చేసుకొని ఏడాది రెండేళ్ళకే డైవర్సులు, యివన్నీ చూడడం లేదా. పెళ్ళికి ముందు ప్రతి మగవాడు జంటిల్ మెన్‌లాగే ప్రవర్తిస్తాడు. అసలు రంగులన్నీ పెళ్ళి అయి కల్సి మెల్సి బతకడం ఆరంభించాకగాని బయట పడవు. కొత్త మోజులో నాల్గురోజులు ప్రేమ కబుర్లు చెపుతారు మగవాళ్ళు—ఆ తరువాత అందరూ ఒకటే. ఆడదాని అదృష్టం బాగుంటే సౌమ్యుడు, సహృదయుడు దొరుకుతాడు. మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్నది. మనం నమ్మితీరాలి. అంచేత ఈ మనసులు కలవడాలు, అర్థం చేసుకోడానికి డేటింగ్స్ అంతా రబ్బిష్ అంటాను నేను—" కూతురన్న రబ్బిష్ మాటని వత్తిపలుకుతూ తీవ్రంగానే అంది మాధవి.

"కమాన్ మమ్మీ నీకు రబ్బిష్ అయింది నాకు కావాలని ఏమన్నా రూలుందా. నీ అభిప్రాయం నీది, నా అభిప్రాయం నాది. నీ కోసం నా ఉద్దేశాలు మార్చుకోవాలా—" సూటిగా అంది.

"నా కోసం కాదు, నీ కోసమే మార్చుకోమంటున్నాను. నే చెప్పేది నీ మంచి కోసమేనని గ్రహించమంటున్నాను. ఇక్కడికి వచ్చిన ఈ పన్నెండేళ్ళ నుంచి చుట్టూ చూస్తూ, తెల్సుకున్న విషయం నుంచి నేర్చుకున్న పాఠాల అనుభవం వల్ల చెప్తున్నాను. ఈ డేటింగులు, ఈ ప్రేమ యిదంతా మనలాంటి వాళ్ళకి కాదు...." నచ్చ చెప్పబోయింది.

"మమ్మీ నీవెలా మాట్లాడు తున్నావంటే అమెరికాలో అందరూ చెడిపోయి నట్టు—రోజూ అందరూ డైవర్సులు పుచ్చుకుంటున్నట్టే మాట్లాడుతున్నావు. ఏం వీళ్ళెవరు పెళ్ళిళ్ళు చేసుకోవడం లేదా, సంసారాలు చేయడం లేదా, ఎటొచ్చి మనకి వాళ్ళకి తేడా ఏమిటంటే ఒకరితో ఒకరికి పడకపోయినా లోకం కోసం నటిస్తూ, తిట్టుకొంటూ, కొట్టుకుంటూ పడివుంటాం మనం. వాళ్ళు లోకాన్ని కేర్ చెయ్యకుండా వాళ్ళు సుఖం చూసుకుంటారు. మమ్మీ మీ అందరికీ అమెరికా కావాలి, ఇక్కడ ఉద్యోగాలు కావాలి, యిక్కడి డబ్బులు పనికొస్తాయి. ఈ దేశంలో వుంటూ, ఈ దేశం తిండి తింటూ యిక్కడి మనుష్యులని విమర్శిస్తారు. ఐ హేట్ దీజ్ డబుల్ స్టాండర్డ్స్....మీ పిల్లలని అమెరికాలో పెంచుతూ వాళ్ళకి ఇండియన్

థింకింగ్‌లే కావాలంటారు. అన్నీ ఎలా కుదురుతాయి...." వ్యంగ్యంగా ఎత్తిపొడిచింది—కూతురు మాటల్లో నిజం వున్నా చిన్నపిల్ల తమని వేలెత్తి చూపిస్తూ ఎత్తిపొడిచేసరికి సహించ లేకపోయింది మాధవి.

"నందూ యిన్ని మాటలు అనవసరం, అమెరికాలో వున్నంతమాత్రాన మన ఆచార వ్యవహారాలు వదిలేసి అమెరికన్స్‌మి అవక్కరలేదు. ఎవరి సంగతో నాకనవసరం—మేం మా పిల్లలని ఇండియన్ పద్ధతిలోనే పెంచాం - పెంచాలనుకుంటున్నాం. ఈ డేటింగులు, యీ లవ్ ఎఫైర్లు పెళ్ళికి ముందు మేం ఒప్పుకోం. ఇప్పుడు నీకు చూపించిన ఫోటోలో అబ్బాయి యింజనీరింగు చదివి. ఎమ్. ఎస్. చేయడానికిక్కడికి వస్తున్నాడు, తల్లి, తండ్రి డాక్టర్లు—మన వాళ్ళు—చదువు, సంస్కారం, డబ్బు, హోదా అన్నీవున్న ఫేమిలీ వాళ్ళది. ఆ అబ్బాయి అమెరికా వస్తే మళ్ళీ గ్రీన్‌కార్డు వచ్చేలోగా రావడం కుదరదని పెళ్ళిచేసి పంపాలని వాళ్ళ తల్లి తండ్రులు అనుకుంటున్నారు. అబ్బాయి చక్కగా, స్మార్ట్‌గా వున్నాడు. అన్ని విధాల మంచి సంబంధం అని మామయ్య రాశాడు. నీ ఫోటోచూసి నచ్చావట. మా అందరికీ నచ్చిందీ సంబంధం· నీ వాకర్తివి వూ అంటే ఇండియాకి టికెటు బుక్ చేసుకొని వెళ్ళి పెళ్ళి చేసుకుని రావడమే—అన్నీ కుదిరిన యింత మంచి సంబంధం మనం కావాలన్నప్పుడల్లా రాదు....అంచేత ఈ సంబంధం ఒప్పుకో—డేటింగుల పేర ఏ తలమాసిన వాడితోనో తిరగడం-అదంతా కుదరని వ్యవహారం. అది మన కల్చర్ కాదు." శాసిస్తున్నట్లుగా అంది మాధవి. తల్లిగొంతులో తీక్షణత, ఆమె మాటల్లో శాసిస్తున్న తీరు చూసేసరికి నందిత ఇన్సల్ట్ ఫీలయింది. ఆ అమ్మాయి మొహం ఎర్రబరుచుకుని,

"మమ్మీ ఐ నో వాట్ ఐ వాంట్, ఐ నో వాటీజ్ గుడ్ ఫర్ మి—డోన్ట్ ట్రీట్ మి యాజ్ ఎ కిడ్, ఎన్డ్ డోన్ట్ ఇన్‌సిస్ట్ మి ఇన్ దిస్ మాటర్ ఎనీమోర్." అంటూ విసవిస అక్కడనించి వెళ్ళిపోయింది నందిత. ఆ తిరస్కారాన్ని ఆ పొగరుని సహించలేకపోయింది మాధవి. డ్రాయింగ్ రూమ్‌లో పేపరు పట్టుకు కూర్చున్న ప్రకాశరావు తల్లీ కూతుళ్ళ సంభాషనంతా వింటూనే వున్నాడు. మాధవి విసురుగావచ్చి సోఫాలో కూలబడింది. "అన్నీ వింటూ కూడా మీరిలా నిమ్మకు నీరెత్తినట్టు ఎలా వూరుకుంటున్నారో నాకర్థంకావడంలేదు-" కోపం అంతా భర్త మీదకి తిప్పి దులిపిందిమాధవి.

"కూల్ డౌన్ మై డియర్—" పేపరు పక్కన పెడ్తూ శాంతంగా అన్నాడు.

"చాల్లెండి. దాని మాటలు వింటూ, దాని పొగరుచూస్తూ కూడా కల్పించుకోకుండా వూరుకుంటున్నారు గాబట్టే దానికసలు నా మాటంటే భయం లేకుండా



కథా నిలయం
783
శ్రీకాకుళం

పోయింది. అలాంటప్పుడు వచ్చి కొంత మగవాళ్లు మందలిస్తే పిల్లలకి భయం వుంటుంది. మిమ్మల్నిచూసే అదలా ఆడుతోంది" ఉక్రోషంగా అంది మాధవి.

"ఏం అనమంటావు. అంటే, నీకు వచ్చిన జవాబు నాకూ వచ్చేది. అనకపోబట్టి నా గౌరవం మిగిలింది. మధూ, ఈ కాలం పిల్లలని కొంత జాగ్రత్తగా టాకిల్ చెయ్యాలి, టెంపర్ లూజ్ చేసుకుని మనం చేయగల్గింది ఏమీ లేదు."

"ఆ....అన్నీ అయ్యాయి, శాంతంగా చెప్పాను, చిలక్కి చెప్పినట్టు నచ్చ చెప్పాను. మంచి చెడ్డ విడమరచి బోధపరిచాను. అసలు నా మాటంటే దానికి లెక్కలేదు."

"మపం సజెస్ట్ చేసినట్టు చేసి వదిలెయ్యాలి. ఆలోచించుకునే ఛాన్సు వాళ్ళకే వదిలేస్తే అప్పుడు కొంత వింటారు. అంటే మనమే ఆలోచించి, నిర్ణయించేసినట్టు మాట్లాడితే వాళ్ళ "ఇగో" దెబ్బ తింటుంది. దాంతో వాదన, మొండి జవాబులు యిస్తారు. అది నీవు గ్రహించవు గదా—"

"ఏమిటండీ గ్రహించేది — నేనేం దాన్ని విషం తినమన్నానా—మంచి సంబంధం. పెళ్ళి చేసుకోమన్నాను. అడ్డమైన వెధవలతో డేటింగులు చేసి, ఏ తల మాసిన వాడినో, ఏ అమెరికన్నో కట్టుకుంటానంటే వూరుకోమంటారా" కోపంగా అనేసింది.

"అంతదాకా వస్తే మనం చెయ్యగలిగింది ఏమీ లేదనుకో. బలవంతంగా పెళ్ళికి ఈ కాలం పిల్లలని ఎలా ఒప్పించగలం. మంచి సంబంధం అని, అన్ని విషయాలు చెప్పావు—దానికి కొంత ఆలోచించడానికి టైమివ్వు. ఊరికే పదిసార్లు చెప్పి దాన్ని ఊరికే సాధిస్తుంటే అది మరింత పేట్రేగిపోతుంది. రెండు మూడు రోజులు టైమిచ్చి దాంతో నేను మాట్లాడతాను ఈ సారి. నీవింక ఈ ప్రసక్తి దాని దగ్గర తేవద్దు.

"ఏమిటో ఈ అమెరికావచ్చి పొరపాటు చేసేమేమో ననిపిస్తూంది. ఇండియాలో వుంటే ఇంతలా పిల్లలు మరీ మితిమీరిపోవడం లేదు. యిక అందరినీ చూసి వీళ్ళూ ఇలా తయారవుతున్నారు. ఏదన్నా అంటే "జనరేషన్ గ్యాప్" అంటూ పెద్ద కబుర్లు...."

"మధూ నీవాక సంగతి మరిచిపోకూడదు. వాళ్ళకి జ్ఞానం వచ్చీ రాక ముందు మనం వాళ్ళని యిక్కడికి తీసుకొచ్చాం. వాళ్ళ చుట్టూ వాతావరణం, భాష, ఫ్రెండ్సు, క్లాసు మేట్స్, యీ టి.వీలు యివన్నీ ఆ పసివాళ్ళ మనసులమీద ముద్ర వేయవంటావా. ఈ దేశంలో వుంటూ ఈ అలవాట్లు అలవరచు కోవద్దంటున్నాం. అమెరికన్ సిటిజన్స్‌మి అయినా యింక యిండియాలో లాగే వుండాలని మనం అను

కుంటున్నాం గానీ యిక్కడ చిన్నప్పటినుంచి పెరిగి యిండియా వాతావరణానికి దూరంగావున్న పిల్లలు ఈ ప్రదేశపు అలవాట్లని అనుసరించి చూస్తారు. మనం అంటే ఇండియాలోపుట్టి ముప్పై ఏళ్ళు పెరిగాం. మన రక్తంలో ఆ భావాలు జీర్ణించుకుని వున్నాయి. మన పిల్లలు అలా కాదుకదా చుట్టూవున్న వాతావరణం వాళ్ళని యిన్ఫ్లుయన్స్ చేయదా."

"ఆ ఇన్ఫ్లుయన్స్ వుంటుందనేగా నా బాధ. ఆ యిన్ఫ్లుయన్స్ వీళ్ళమీద పడ కుండా వుండాలనేగదా నా తాపత్రయం. మంచి నేర్చుకున్నా తప్పులేదు, కాని మన వాళ్ళు వాళ్ళ బాడ్ హేబిట్స్ తొందరగా నేర్చుకుంటున్నారు. వాళ్ళలా పది హేనేళ్ళు వచ్చేసరికి స్వతంత్రులై పోయినట్టు యిష్టం వచ్చినట్టు తింటూ తిరుగుతూ, డేటింగుల పేరిట అడ్డమైనవాళ్ళతో తిరుగుతూ పెళ్ళి కాకముందే సెక్స్. ఎబార్షన్.... వాడు నచ్చకపోతే షర్టు మార్చినట్టు యింకోడ్ని మార్చడం....అది కాకపోతే ఏ వెధవనో కట్టుకుని నాల్గురోజులు కాపురంచేసి డైవర్సులు, యిక్కడ ఫేమిలీ లైఫ్లు చూస్తుంటే మన పిల్లలు అలా తయారవుతారేమోనని భయపడడం తప్పంటారా...."

"నీవు తప్పుగా ఆలోచిస్తున్నావని, నీ ఆలోచన అత్యాశని అనను. కాని వాళ్ళ ఆలోచనలు ఇలా వుండవుగదా. "మమ్మీ డాడీ అమెరికాలో వుండాలి యిక్కడి డబ్బులు పనికి వస్తాయి గాని అమెరికన్స్లా వుండకూడదంటారు. అంతా నేరో థింకింగ్ అంటూ ఎత్తిపొడుస్తారు. వాళ్ళనీ తప్పుపట్టలేం మనం. మన ఆలోచనలకి వాళ్ళ ఆలోచనలకి మధ్య జనరేషన్ గ్యాప్ అనే వారధి వుంది. దేశం, భాష, మతం, ఆచారం సంస్కృతి అన్నీ వేరయిన దేశంలో పొట్ట కూటి కోసం వున్నాం అనుకుంటున్నాము....మన వాతావారణానికి దూరంగా పెరిగిన పిల్లల మన నత్వం అర్థం...."

"అర్థం చేసుకున్నానండీ బాబు, అందుకే భయం నాకు. ఎక్కడిది తప్పు టడుగు వేస్తుందో అనే ఆదుర్దా. నన్నంటారుగాని రేపు మీ అమ్మాయి ఏ అమెరి కన్నో పెళ్ళాడుతానంటే అంగీకరిస్తారా మీరు, బాధపడరా...." నిలేసింది.

"ఎలా అంగీకరిస్తాను. ఎప్పటికీ అంగీకరించను. కాని మన అంగీ కారంతో అది సంబంధం లేదనుకుంటే మనం ఏమీ చెయ్యలేమనే నేను చెప్పేది. అంచేత ప్రిపేర్ యువర్ సెల్ఫ్ ఫర్ ది వరస్ట్ అంటున్నాను."

"అది అంత దూరం వెళ్ళకముందే కంట్రోల్ చేయడం మన బాధ్యతకదా తల్లిదండ్రులుగా. యిప్పటికింకా దానికి ఎకనమికల్ యిండిపెన్డెన్స్ రాలేదు గనుక కాస్త మన మాట వినే స్టేజిలో వుంది. ఇంకా పూర్తిగా చెయ్యిదాటి పోక

ముందే మూడుముళ్ళు వేయించేస్తే...." మాధవి తల్లి మనసు ఆరాటం అర్థం అయింది. ప్రకాశరావుకి, మాధవితో అన్ని విధాలా ఏకీభవించడానికి అతనికేం అభ్యంతరంలేదు. ఎటొచ్చీ కూతురి సంగతి తెల్సిన అతను యిరవై ఏళ్ళు నిండకుండా గ్రాడ్యుయేషన్ పూర్తికాకుండా తమ మాటవిని పెళ్ళికి వప్పుకొంటుందా యిప్పుడు....అతనికేం నమ్మకంలేదు. భార్య అన్నట్టు అన్నీవున్న మంచి సంబంధాలు అనుకున్నప్పుడల్లా దొరకవు—ఆ సంగతి పిల్లలకి అర్థంకాదు. అర్థం చేసుకుంటే వాళ్ళు అదృష్టవంతులే....

"మీరొకసారి పిల్చి చెప్పండి" మాధవి అంది.

"ష్యూర్....కానీ రెండురోజులు ఊరుకుని మాట్లాడుతాను—ఈలోగా దాన్ని కొంత ఆలోచించుకోనీయి. ఈలోగా నీవు మళ్ళీ దాని దగ్గర ఈ ప్రసక్తి తేవద్దు." భార్య చేతిమీద చెయ్యివేసి అనునయంగా అన్నాడు. మాధవి తల ఆడించింది.

* * * *

ప్రకాశరావు పన్నెండేళ్ళ క్రితం అమెరికా వచ్చాడు. ప్రకాశరావు ఎమ్.టెక్ చదివాడు. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్‌లో మంచి జాబ్ చేస్తుండేవాడు—అనుకోకుండా అమెరికా వెళ్ళే ఛాన్సు వచ్చింది. ఎంత మంచి జాబ్‌లోవున్నా పన్నెండేళ్ళ సర్వీసువున్నా ఇండియాలో సంపాదన ఖర్చులకే సరిపోతుంది. అమెరికావెళ్ళి నాలుగయిదేళ్ళు వుండి కొంత డబ్బుకూడ పెట్టుకుని రావాలన్న ఉద్దేశంతోనే అమెరికా వెళ్ళినప్పుడు, అక్కడ సెటిల్ అవ్వాలన్న ఉద్దేశం లేదు. అప్పుడు నందితకి ఎనిమిది, నవీన్‌కి ఆరేళ్ళు—అమెరికా వచ్చాక అదృష్టం తన్నుకొచ్చి చాలా తొందరగా పైకి ఎగబాకి పోయాడు. మంచి కంపెనీలనుంచి చాలా మొత్తం జీతాలతో ఆఫర్లు వచ్చి మూడు కంపెనీలు మారాడు. ఇప్పుడు పనిచేస్తున్న కంపెనీ చాలా పెద్ద జీతం యిస్తుంది. ఆ కంపెనీ వాళ్ళే అమెరికన్ సిటిజన్‌షిప్ యిప్పించే ఏర్పాటు చేస్తాం వుండిపొమ్మని బలవంతం పెట్టారు. అమెరికా వచ్చాక అక్కడి డబ్బు, అక్కడ కంఫర్ట్సు వదులుకొని ఇండియా వెళ్ళాలనిపించలేదు. నాలుగైదు ఏళ్ళు అనుకుని వచ్చినా డబ్బువస్తున్న కొద్దీ యిండియా తిరిగివెళ్ళాలన్న యావ తగ్గిపోయింది. దానికి తోడు రెండేళ్ళకి ఓ సారి శలవులకి యిండియా కెళ్ళినప్పుడు పిల్లలకి అసలు అక్కడి వాతావరణం నచ్చేదికాదు. అమెరికాలో సదుపాయాలు లేక టి. వి లు అవి లేక బోర్ అనేవారు. ఆ రోడ్ల మీద దుమ్ము ధూళి అవన్నీ చూసి మేం యిండియా రాం" అనేవారు వాళ్ళు. వాళ్ళు పెద్ద వాళ్ళు అవుతున్న కొద్దీ వాళ్ళలో అభిప్రాయం మరింత బలపడిపోయింది. నందిత అయితే "నేను చచ్చినా రాను మీరు వెళ్ళినా నేను యిక్కడే వుండి చదువుతాను" అని వాదించేది. ఈలోగా కంపెనీ వత్తిడి

చేసి సిటిజన్‌షిప్‌కి ఏర్పాటుచేసి యిప్పించారు. యిండియాలో ఆస్తులు అమ్ముకుని బంగారం చేసుకుని అమెరికా వాసులయిపోయారు. ఏడాదికి మిలియన్ డాలర్లు, పెద్ద ఫోర్ బెడ్‌రూము, ఆధునిక సదుపాయాల యిల్లు మూడు కార్లు.... ప్రకాశరావు చాలా బిజీగా పెద్ద హోదాగల వ్యక్తిగా అయిపోయాడు. అక్కడ నందిత చిన్నప్పటి నించి అందరితో కొత్త పాత లేకుండా గలగల మాట్లాడేది. అతి తొందరగా స్నేహం చేసుకునే స్వభావమేమో నందితకి ఎంతోమంది ఫ్రెండ్సు, స్కూలు ఫ్రెండ్సు యిరుగుపొరుగు ఫ్రెండ్స్, ఫేమిలీ ఫ్రెండ్సులో ఆమె ఈడు పిల్లలు యిలా రకరకాల స్నేహితులుండేవారు. టీనేజ్‌కి వచ్చాక యింకా ఫ్రండ్స్ సర్కిల్ పెద్దదయి పోయి ఎప్పుడూ అబ్బాయిలు, అమ్మాయిలతో సినిమాలు. యింట్లో పెద్ద షటిల్ కోర్టు ఉండేదేమో గేమ్స్‌లని, పార్టీలని తెగతిరిగేది. ఎంతతిరిగినా స్వతహాగా తెలివైనది అవడంవల్ల క్లాసులో రేంకు తెచ్చుకునేది. వయసుతోపాటు రకరకాల షోకులు, ఫేషన్లు పెరిగాయి. ఫ్రాకులు, మిడీలు, బాబ్‌లు, లిప్‌స్టిక్‌లు, జీన్స్, హైహీల్స్— అమెరికన్ ఏసతో యింగ్లీషు, ఆ అమ్మాయి అచ్చు అమెరికా పిల్లలా మారిపోయింది. శలవ వస్తే బ్యూటీ క్లినిక్కులు, ఫేషియల్స్, అంటూ ఏవేవో చేసేది. ప్రకాశరావు డబ్బు పుష్కలంగా సంపాదిస్తున్నాడేమో, కోరిన డ్రస్సల్లా, రకరకాల షూస్, బ్యాగులు ఏది కావాలంటే అవి కొనేది. మాధవికి కూతురి వేషాలు. కూతురి ఫ్రెండ్స్ సర్కిల్ చూసి యీ పిల్ల ఎలా తయారవుతుందిరా భగవంతుడా అని బెంగపడేది. ఎంత డబ్బున్నా మరీ అంత నీళ్ళలా విచ్చలవిడిగా ఖర్చుపెట్టేస్తూంటే మందలిస్తూనే వుండేది. "నీ పాకెట్ మనీ యింతకంటే యివ్వను" అనేది. కాని నందిత తండ్రి దగ్గర గారాలుపోయి డబ్బులు లాగేది. "పోనీద్దూ, యీ ఏజ్‌లో కాకపోతే యింకెప్పుడు సరదాలు పిల్లలకి తీరుతాయి. పెళ్ళయ్యాక మనం యిచ్చినా తీసుకుంటుందా, అనేవాడు ప్రకాశరావు.

మాధవి ఒక్కొక్కసారి చూసీచూడనట్టు వదిలేస్తూ, ఒక్కొక్కసారి మందలిస్తూ కాస్త కంట్రోలులో పెట్టడానికి ప్రయత్నించేది. మరీ కట్టడి చేస్తే కోపగిస్తే మొండికేస్తారని, అబద్ధాలు మొదలు పెడతారేమోనన్న భయం వుండేది మాధవికి. "పిల్లల్ని పెంచడం, అందులో అమెరికాలో, కత్తిమీద సాములాంటిది బాబూ" అనేది మాధవి భర్తతో. నవీన్ నందితలా ప్రోబ్లమేటిక్ చైల్డ్ కాదు. తన చదువు, తన పుస్తకాలు తప్ప, ఎక్కువ ఫ్రెండ్స్ లేకుండా ఒకరిద్దరు బెస్ట్ ఫ్రెండ్స్‌తో మాత్రం వుండేవాడు. అట్టే హూటకారి కాదు. ఇచ్చిన పాకెట్ మనీయే ఖర్చుపెట్టకుండా దాచుకుంటే, నందిత యిచ్చిన దానికి నాలుగు రెట్లు లాగి ఖర్చుపెట్టేది.

నందిత కాలేజీ లెవల్‌కి వచ్చేసరికి మరింత మంది ఫ్రెండ్స్, అందులో బాయ్ ఫ్రెండ్స్ ఎక్కువయ్యారు. అందులో నలుగురయిదుగురు అమెరికను

బాయిస్ వుండేవారు. అది చూసి మాధవిలో కంగారు మొదలైంది. దానికితోడు ఆ టెర్మ్ ఎగ్జామ్‌లో మార్కులు బాగా తక్కువ వచ్చాయి. మాధవి కోపంగా నిలేస్తే, "ఇట్స్ ఓకే మమ్మీ. ఒకసారి కాస్త మార్కులు తక్కువ వస్తే కొంప మునిగి పోయినట్టు హడావిడి చేస్తావేం. ఈసారి బోరు కొట్టి చదవాలనిపించలేదు." నిర్లక్ష్యంగా అంది.

"కొద్తుంది కొద్తుంది. నీకీ మధ్య మరీ ఫ్రెండ్సు, తిరగడం ఎక్కువయింది. నీ వరస చూస్తున్నాను. కొస్త ఫ్రెండ్సుని తగ్గించు. ఆ అమెరికన్ అబ్బాయిలతో నీకేమిటి స్నేహం...." సందు దొరికిందని సాధించింది మాధవి.

"ఏం అమెరికన్స్ అయితే. మా కాలేజీ మేట్స్ వాళ్ళు. అమెరికాలో వుంటూ, అమెరికా తిండి తింటూ, అమెరికన్ ఫ్రెండ్స్ మాత్రం వుండకూడదేం.... యూ టాక్ ఆల్ రబ్బిష్" హేళనగా ఎత్తిపొడిచింది నందిత. అలా మాట్లాడే కూతురుని యింకా ఏమన్నా అంటే మరీ నోరు పారేసుకుని యిన్సల్ట్ చేస్తుందని అప్పటికి వూరుకుని, తర్వాత భర్తతో కంప్లైంట్ చేసి, "మీరు దాన్ని కేకలేస్తారా లేదా" అంటూ హఠం సాగించింది మాధవి. ప్రకాశరావు నందితని పిలిచి తల్లితో అలా మాట్లాడినందుకు, చదువు పాడుచేసుకుని స్నేహితులతో తిరుగుడు ఎక్కువయిందని మందలించాడు. ఎప్పుడూ అనని తండ్రి కేకలేస్తే కాస్త భయపడింది నందిత. ఓ పది పదిహేను రోజులు కాస్త ఫ్రెండ్సుని తగ్గించింది. తరువాత మళ్ళీ మామూలే. కూతురికి యిరవై వచ్చిందగ్గిరనించి పెళ్లి చేసేయాలన్న ఆరాటం పట్టుకుంది మాధవికి. ఇంతవరకు స్నేహితులంటూ గ్రూపులో తిరగడం తప్ప, ప్రత్యేకంగా ఏ ఒక్కడితోనూ డేటింగులు అవీ జరపలేదు. అదేదో చేసే లోగా. ఎవడినో ప్రేమించాననేలోగా, చెయ్యి జారిపోయేలోగా కూతురికి మంచి సంబంధం చూసి చేసేయాలన్న ఆరాటం మొదలైంది. ఇండియా వెళ్లినప్పుడల్లా అన్న అక్క అందరూ ఎన్నో సంబంధాలు చెప్పేవారు. అమెరికాలో వున్న తెలుగు వాళ్ళెవరెవరున్నారో, వాళ్ళ అబ్బాయిల చదువులు, తమకంటే వాళ్ళకే బాగా తెలుసు. అమెరికాలో వున్న తెలుగు వాళ్లు చాలా మంది తమ అబ్బాయిలకి, అమ్మాయిలకి యిండియా కెళ్లినప్పుడల్లా సంబంధాలు చూసి చేసుకువచ్చేసేవారు. అమెరికాలో అబ్బాయిలు వున్నా తమ సాంప్రదాయం ప్రకారం యిండియాలో మంచి కుటుంబంనించి వచ్చిన పిల్లల్నే కొడుకులకి చూసేవారు. తాము అమెరికన్ సిటిజన్స్ కనక పెళ్ళవగానే "వీసా" అదీ తొందరగా వచ్చేస్తుంది కనక చాలా మంది నందితని చేసుకుంటాం అని వాళ్లే కబురు పంపారు. యిరవై ఏళ్ళన్నా లేకుండా ఏం పెళ్ళిలే అని యిన్నాళ్లూ సీరియస్‌గా ఆలోచించలేదు. కాని నందిత వరస చూసి ఆమె చెయ్యిదాటిపోకముందే పెళ్లి చెయ్యాలని నిర్ణయించుకుని మంచి

సంబంధం చూడమని తనవాళ్ళకి రాసింది మాధవి. అన్నింట్లోకి యీ యింజనీరు అబ్బాయి సంబంధం బాగుందని చూద్దాం అంటే కూతురు వాడెవడో ముక్కూ ముఖం తెలియదు ఎలా చేసుకుంటాను అని వాదిస్తుంది. దీన్నెలా వప్పించడం? తండ్రి చెప్పినా వింటుందో లేదోనని మాధవి మనసులో మధనపడసాగింది.

* * *

"నందూ వాట్ హేపెన్డ్, వై ఆర్ యూ లుకింగ్ సో డల్ సిన్స్ టూ డేస్. ఆర్ యూ ఆల్‌రైట్." జేనెట్ ఆదుర్దాగా అడిగింది.

"నథింగ్, ఐ యామ్ ఓకే...." నందిత నవ్వి అంది. ఆ నవ్వులో జీవం లేదని జేనెట్ గుర్తించింది.

"కమాన్ డియర్, ఐ నో సమ్‌థింగ్ యీజ్ రాంగ్.... బి ఏ గుడ్ గర్ల్ అండ్ టెల్ మి."

జేనెట్, నందిత యిద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్. ఐదో క్లాసునుంచి కాలేజీ వరకు క్లాస్‌మేట్స్. ఒకరి దగ్గిర ఒకరికి రహస్యాలు లేవు. ఒకరి సమస్యలు ఒకరు చెప్పుకుంటారు, చర్చించుకుంటారు. రెండు రోజులనించి నందిత మొహం వాడిపోయి వుందని కనిపెట్టి అడిగింది జేన్.

"ఏం లేదు. మమ్మీ డాడీ పెళ్ళి పెళ్ళి అని బోరుకొట్టి చంపుతున్నారు.... ఎవడో యిండియాలో యింజనీరింగు చదివి ఎమ్.ఎస్. చేయడానికిక్కడికి వస్తాడుట. వాడ్ని చేసుకోమని చంపుతున్నారు. ఇన్నాళ్ళూ మమ్మీయే అనుకుంటే యిప్పుడు డాడీకూడా అమ్మ పక్షమే మాట్లాడుతున్నారు. నిన్న ఓ అరగంట లెక్చరిచ్చి చంపారు...." విసుగ్గా అంది.

"హౌ లక్కీ యూ ఆర్....దీనికోసమా మొహం అలా పెట్టావు. చక్కగా అమ్మా నాన్నా మంచివాడ్ని తెచ్చి చేసుకోమంటే నీకెందుకీ బాధ...."

నందిత జేనెట్ వంక ఆశ్చర్యంగా చూసింది. "ఏమిటి మాట్లాడుతున్నావు నువ్వు? వాడెవడో ముక్కూ మొహం తెలియకుండా, పది నిముషాలు చూసి ఎలా చేసుకోను. అతనెలాంటివాడో, టేస్టులు ఏమిటో, ఐడియాలు, అభిప్రాయాలు కలుస్తాయ? లేదా తెలియకుండా ఎలా చేసుకోను....అసలు తెలియకుండా ఎలా చేసుకోమని సలహా యిస్తున్నావు. మీరంతా చక్కగా డేటింగులు చేసి నచ్చినవాడ్ని చేసుకుంటారు. నేను యిండియన్‌ని అనా యిలాంటి సలహా యిస్తున్నావు." నిష్ఠూరంగా అంది నందిత.

"నందూ డియర్, చూడు అమెరికా అమ్మాయిగా నేను చెప్తున్నాను. ఈ డేటింగ్‌లు, ఈ లవ్‌లు, ఈ టేస్టులు, ఐడియాలు కలవడం అంతా బుల్‌షిట్ అంటాను. యిట్స్ షీర్ నాన్సెన్స్, నథింగ్ ఎల్స్. ప్రతి మగవాడూ అమ్మాయి స్వంతం అయేవరకు చాలా జంటిల్మన్‌లాగ, నమ్రతగా మన మాటలతో ఏకీభవిస్తాడు. కొత్త అందమైన, డబ్బున్న అమ్మాయి అయితే యింకా ఎక్కువ నటిస్తాడు. ఈ మగాళ్ళ అసలు రంగులన్నీ పెళ్ళయ్యాక గాని బయటికి రావు. కొత్త మోజులో కొన్నాళ్ళు మన మాట విన్నట్టు నటిస్తారు. ఆ తరువాత చూపుతారు తమ ప్రతాపాలు. ఏదన్నా అందేవరకే అపురూపం. తరువాత రొటీన్ అయిపోయి ఏ థ్రిల్లూ వుండదు. ఆడదయితే సెక్యూరిటీ కోసమో. పిల్లల కోసమో, పరువు కోసమో కాపురం కొనసాగించాలనే అనుకుంటుంది. మగవాడికి ఆ అవసరం ఏముంది, డేటింగుల పేరుతో అమ్మాయిలని వెంటాడుతారు. నచ్చకపోతే నాలురోజుల తర్వాత వదిలేస్తారు...." నందిత ఆశ్చర్యంగా చూస్తూండి పోయింది.

"ఔను నందూ....చక్కగా నీకా బాధ, రెస్పాన్స్‌బిలిటి లేకుండా అమ్మ, నాన్న నీమంచి ఆలోచించి అబ్బాయిని తెచ్చి చేసుకోమంటే....రియల్లీ! నాకు నిన్ను చూస్తే అసూయగా వుంది. మాకు అలాంటి అదృష్టంలేదు నందూ. మా పెళ్ళి బాధ్యత మా పెద్దవాళ్ళు తీసుకోరు. మంచో చెడ్డో మేమే ఎవడినో వెతుక్కోవాలి. మా భవిష్యత్తు మేమే డిసైడ్ చేసుకోవాలి. అదృష్టం బాగుండి మంచివాడయితే సరే, లేకపోతే వచ్చే ప్రోబ్లమ్‌ని మేమే సాల్వ్ చేసుకోవాలి. మాకు కాస్త వయసు వచ్చిందగ్గరనించి రెక్కలొచ్చిన పక్షులని గూటిలోంచి తరిమేసినట్టు మావాళ్ళేం మా గురించి పట్టించుకోరు. మా భవిష్యత్తుకి వాళ్ళ పూచీ ఏమీలేదు. మీ యిండియన్ గర్ల్స్ ఎంత అదృష్టవంతులు. మీ బాధ్యత అంతా అమ్మ. నాన్న తీసుకుంటారు. మంచి వరుడ్ని చూసి పెళ్ళి చేస్తారు. పెళ్ళి అయిన తరువాత కూడా మీ మంచి చెడ్డలు చూస్తూనే వుంటారు. మీ భవిష్యత్తులో వారి అండ మీకుందన్న నిబ్బరం మీకిస్తారు. ఇంతకంటే యింకేం కావాలి నందూ, ఏ ఆడపిల్లకైనా...."

"కాని....మనకీ ఓ అభిప్రాయాలుంటాయి, ఐడియాలుంటాయి, కోరికలుంటాయి. అవి కలవని భర్తతో కాపురం ఎలా చేయమంటావు. మీ కయితే నచ్చనివాడితో విడిపోయే అవకాశాలు సులువు. మాకు ఆ అవకాశాలు తక్కువ. అందుకే ముందే బాగా చూసుకుని...."

"నీ పిచ్చిగాని ఏం చూసుకుంటావు. నేను ముందే చెప్పినట్టు మనిషి సహజగుణాలు, లోపాలు కల్సి బతకడం ఆరంభించాకగాని బయటికి రావు. ముందు ఎంతో మంచివాడిలా నటించి తరువాత మారిపోతే ఏం చెయ్యగలవు. నందూ....

యీ పెళ్ళిళ్ళు గాంబెల్ అనుకో. అదృష్టం బాగుంటే, కొత్త మంచివాడు దొరికితే సర్దుకుపోయి బతుకుతాం. లేదంటే బతుకు నరకం. విడిపోయి, డైవర్సులు తీసుకుని మేం సాధించింది ఏమిటంటావు. ఫేమిలీ లైఫ్ లేక, సెక్యూరిటీ లేక, పిల్లలంటే వారికి తల్లి. తండ్రి యిద్దరిలో ఎవరిదో ఒకరి ప్రేమ కరువయి, మరిన్ని బరువు బాధ్యతలు నెత్తినపడి నలిగిపోతుంది అమెరికా స్త్రీ. డైవోర్సులు తీసుకున్నాక మళ్ళీ పెళ్ళి చేసుకుంటే ఆ రెండో మొగుడు తిన్నగా వుంటాడని ఏముంది...."

"అంటే అమెరికాలో మేరీడ్ లైఫ్ బాగోలేదంటావా. ప్రేమించుకుని పెళ్ళి చేసుకుని ఎందరు హాయిగా లేరు?"

"అమెరికాలో పెళ్ళిళ్లు చేసుకోడం లేదని, సంసారాలు చేయడం లేదని నేననను. కాని హాయిగా సంసారాలు చేసుకుంటున్న వాళ్ళ పర్సంటేజ్ కంటే. ప్రేమించుకుని పెళ్ళిళ్ళు చేసుకున్నాక ప్రోబ్లమ్స్ స్టార్టయి విడిపోయే వాళ్ళ పర్సంటేజ్ ఎక్కువ. మీ యిండియాలో కష్టమో సుఖమో, ఒకసారి పెళ్ళయ్యాక అంత సుళువుగా విడిపోరు. ఆవిధంగా అక్కడి ఆడవాళ్ళకి సెక్యూరిటీ వుంది. ఏదన్నా యిటు అటు అయితే ఆదుకోడానికి పెద్దవాళ్ళుంటారు....అక్కడి పిల్లలకి యింకేమున్నా లేకపోయినా తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు పుష్కలంగా దొరుకుతాయి. వాళ్ళు పెరిగి చదువులై, ఉద్యోగం చేసేవరకు వాళ్ళకి రెస్పాన్సిబిలిటీలు లేవు. టెన్షన్స్ లేవు. యిక్కడిలా పదిహేనేళ్లు వచ్చిందగ్గరినించి ఏదో చేసి డబ్బు సంపాదించాలన్న బాధ, బాధ్యత అక్కడి పిల్లలకి లేదు. అమ్మ, నాన్న హాయిగాచూసి పెళ్లి చేస్తారు. యిక్కడి పిల్లలతో పోలిస్తే మీ యిండియన్ పిల్లలు అన్ని విధాల అదృష్టవంతులంటాను. మాకున్న డబ్బు లేకపోవచ్చును, కంఫర్ట్స్ లేకపోవచ్చును ఇండియాలో. కాని అక్కడి సెక్యూరిటీ యిక్కడ ఏ స్టేజీలోనూ లేదు మాకు. అందుకే యిప్పుడు మా థింకింగ్‌లో మార్పు వస్తూంది. ఈ పెళ్ళిళ్ళు, ఊ.... ఆ .. అంటే విడిపోవడం, పిల్లలు మధ్యన నలిగిపోవడం, అది చూస్తూ ఫేమిలీ లైఫ్ కోసం సర్దుకు బతకాలనే ఆలోచన మా వాళ్ళలోనూ వస్తూంది. ఆ ఫ్రీడమ్, ఆ స్వేచ్ఛలో శాంతి, భద్రతలు కరువయ్యాయి అని అర్థం అయ్యాక అందరూ యిదివరకటి ఫామిలీ లైఫ్ మంచిదన్న నిర్ణయానికి వస్తున్నారు....ఇద్దరు కొత్త వ్యక్తులు ఒక యింట్లోకల్సి బతికినపుడు రకరకాల ప్రోబ్లమ్స్, అభిప్రాయభేదాలు రాక తప్పవు. ప్రేమించి చేసుకున్నంత మాత్రాన బతుకంతా పుస్తకాలలో మాదిరి ప్రేమ తిని బతకరు. లైఫ్‌లో వుండే కష్ట నిష్ఠూరాలు ఎలాగో భరించాలి. ఒక

యింట్లో వుంటే వయస్సు వచ్చాక, తల్లీ కూతుళ్ళ మధ్యే మాటా మాటలు వస్తాయే, అలాంటిది పుట్టిన యిరవై ఏళ్ళ వరకు పరిచయంలేని మనిషితో అభిప్రాయభేదాలు ఎందుకు రావు. ఆ మాత్రం దానికోసం ఎవరైతేనేం? సెపర్యేట్ డ్, ఫేమిలీ లైఫ్, పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఇండియన్స్ ఎలా అడ్జస్టు అవుతున్నారో ఆ పద్ధతే నచ్చుతూంది మా వాళ్ళకి. ఇదంతా ఎందుకు చెపుతున్నానో నందూ నీకు తెలుసా. అమెరికాలో వుండి మమ్మల్ని చూసి మా పద్ధతులు మంచి వనుకుని నువ్వీ తప్పటడుగు వేయద్దు. నీ మంచికోరి చెప్పే నీవాళ్ళమాట విని మంచి చదువు, కుటుంబం నుంచి వచ్చిన అతన్ని చేసుకో. నీ స్నేహితురాలిగా యిది నా సలహా....."

నందిత సందిగ్ధతలో పడ్డట్టు, ఆలోచనలో పడింది. "నందూ నీ మనసులో విషయం నాకు తెలుసు. నీవు మైక్ గురించి ఆలోచిస్తున్నావని నాకు తెలుసు. ఈ మధ్య మీ యిద్దరినీ గమనిస్తున్నాను. నీవు అతని పట్ల అట్రాక్ట్ అవుతున్నావు. కానీ నందూ ఆ మైక్ నీకు తగినవాడు కాడు." జేనెట్ మొహంలో మారిన రంగులు చూస్తూ ఆశ్చర్యపడింది నందిత.

"ఎందుకు....ఎందుకలా అంటున్నావు. మైక్ చాలా సరదాగా వుంటాడు.... స్మార్ట్ గై .... చదువులో కూడా బ్రిలియంట్ కదా...." అనుమానంగా చూసింది నందిత.

"చెపితే నాకు జెలసీ అనుకుంటావని చెప్పలేదు. ఎన్నోసార్లు నీతో చెప్పా లనుకున్నాను గాని నామీద నీకు సదభిప్రాయం పోతుందని చెప్పలేదు. సరే నీవింకా డేటింగులు, ప్రేమలు ఆరంభించలేదు గదా. మీ స్నేహం ఎలా దారితీస్తుందో చూసి చెప్పచ్చు అనుకున్నాను. ఆ మైక్ ఒట్టి రోగ్."

"ఏమిటి....ఆశ్చర్యంగా అడిగింది.

"నందూ ఈ మైక్ నిన్ను చూడకముందు మా అక్కతో డేట్ చేసేవాడు. మీ ఫాదరు మాకంటే డబ్బున్నవాడని, నీవు అక్కకంటే బాగుంటావని అక్కని వదుల్చుకుని నీవెంట తిరగడం మొదలుపెట్టాడు తెలుసా. దాంతో ఎనిమిది నెలలు తిరిగాడు. అది వీడిని సీరియస్‌గా తీసుకుని మనసుతోపాటు శరీరం యిచ్చింది. అమ్మ నాన్నకి చెప్పింది. పెళ్ళి డేట్ నిర్ణయించేలోగా మొహం చాటుచేయడం ఆరంభించాడు. అక్క ఎన్నిసార్లు ఫోనుచేసినా వుండి లేదనిపించేవాడు. ఒక్క నెలలో అక్కను వదుల్చుకున్నాడు. తరువాత నీతో స్నేహం మొదలుపెట్టాడు. అక్క పాపం ఎంత ఏడ్చిందో....నీకు కావాలంటే వాళ్ళు రాసుకున్న ఉత్తరాలు, ఫోటోలు అవీ చూపిస్తాను."

నందిత మొహం తెల్లగా పాలిపోయింది. "నిజమా...." అంది నమ్మలేనట్టు.

"నేను గత నాలుగైదు నెలలనుంచి నిన్ను గమనిస్తున్నాను. నిన్ను హెచ్చరించాలనుకుంటూనే నీవు నన్ను అపార్థం చేసుకుంటావని చెప్పలేదు. వాడిని నీ అందం, నీ డాడీ డబ్బు ఆకర్షించింది అంతే, లవ్ గివ్ నమ్మకు."

మైగాడ్ మైక్‌దంతా నిజమైన ఇంటరెస్టని నమ్మాను. నయమే ముందుగా చెప్పావు. ఎన్నోసార్లు డేటింగ్‌కి రమ్మని పిలిచాడు. అమ్మ, నాన్న భయంతో నేను యింకా సాహసం చెయ్యలేదు. ఇంకా నా యింటరెస్టు మమ్మీ, డాడీకి చెప్పి, మైక్‌ని యింట్రడ్యూస్ చేద్దామనుకున్నాను."

"నందూ....అందుకే నాకు ఈడేటింగులు అవీ నమ్మకం లేదు. ఎన్నో కేసులు యిలాంటివి చూసాను. మనకి సెస్తుక్లాసుమేట్ విక్టోరియా నీకు గుర్తుందా. సూయిసైడ్ కమిట్ చేసింది. ఎందుకో తెలుసా. లవ్ ఎఫైర్ ఫేలయి, అది తట్టుకోలేక చచ్చిపోయింది. వాడు దీన్ని మోసంచేసి, డబ్బు ఖర్చు పెట్టించి మొహం మొత్తగానే వదిలిపోయాడు. యిలాంటివి చాలా తెలుసు నాకు. ఫర్ గాడ్ సేక్, నీవు యిలాంటి వాటిలో యిరుక్కోకు నందూ చక్కగా మీ అమ్మ నాన్న చూపించిన అబ్బాయిని చేసుకో. ఈ డేటింగులు, ఈ సెన్షన్స్‌-అవీ వద్దు నీకు స్నేహితురాలిగా యిది నా సలహా." నందిత చేయి పట్టుకుని అంది జేనెట్

* * *

"వాళ్ళ దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది నందూ. ఏం రాయమన్నావు వాళ్ళకి, యిదే నిన్ను ఆఖరిసారి అడగడం, ఏదో ఒకటి జవాబు చెప్పు ముభావంగా అంది మాధవి.

"నందూ....ఈ అబ్బాయి నచ్చకపోతే యింకొకరిని చూస్తాం. నీ అభిప్రాయం స్పష్టంగా చెప్పు" ప్రకాశరావు అనునయంగా అన్నాడు.

"ఒకే డాడీ....యిండియాకి టికెట్స్ బుక్‌చేయండి." నందిత అంది. మాధవి, ప్రకాశరావు నమ్మలేనట్టు మొహాలు చూసుకున్నారు. కూతురు కోపం వచ్చి అలా అంటున్నదని అనుకున్నారు...."నిన్నేం అబ్బాయిని చూడకుండా చేసుకోమనడం లేదు. చూసి నచ్చితేనే...." మాధవి ఏదో అనబోయింది.

"ఫోటో చూసాను....మీరు చూసారు. మామయ్యా వాళ్ళంతా చూసారుగా. మీ అందరికీ నచ్చిందిగా."

"మేం చూడడం వేరు. నీవు చూడకుండా చేస్తా మా నందూ....మేం నీ మంచి కోసం చెపుతున్నాము. మామీద కోపంతో లైఫ్‌లో ముఖ్యమైన విషయాన్ని తొందరపడి నిర్ణయించుకోనక్కర లేదు."

"కమాన్ డాడీ—యిన్నాళ్ళు నేను ఒప్పుకోలేదని కేకలేశారు. యిప్పుడు సరే అంటే మీరెందుకు తటపటాయిస్తున్నారు....నేను వప్పుకుంటున్నానని చెప్పాగా యింకా ఎందుకు ఆర్గ్యుమెంట్సు...."

భార్యా భర్తలిద్దరూ మొహాలు చూసుకున్నారు. మళ్ళీ— "మేం అన్నామని కోపంతో అంటున్నావేమోనని...."

"కోపం ఏం లేదు డాడీ....నా మంచి కోసమే చెప్తున్నారుగా మీరు యూ కెన్ ప్రొసీడ్ విత్ దిస్ మాచ్. ఇంతకంటే ఏం చెప్పాలి." నందిత అక్కడినుంచి వెళ్ళిపోతూ అంది.

కూతురు ఇంత సులువుగా వప్పుకుంటుందని ఆశించని వారిద్దరి మొహాలు సంతోషంతో వికసించాయి.

(వనిత మాసపత్రిక)

★

# ఈతరం అమ్మాయిలు

"డోస్టు బి సిల్లీ మమ్మీ" రోజుకి పదిసార్లు తల్లితో అనే అమాట ఆరోజూ అంది ప్రీతి. డ్రస్సింగ్ టేబిల్ ముందునిల్చొని ఆఖరి నిముషంలో మేకప్ టచ్ చేసుకుంటూ.

రోజులా వూరుకోలేకపోయింది సుజాత. కోపంగా చూస్తూ ఏమిటే ఊరుకుంటున్నకొద్దీ మరీ ఎక్కువవుతుంది. ప్రతీదానికి డోస్టు బి సిల్లీ అంటావు. ఏమిటా మాటలకి అర్థం, ఇంగ్లీషు నీకేకాదు నాకూ వచ్చు! నీవేం చేస్తున్నా వూరుకుంటే సిల్లీ కాదన్నమాట! ఆవేశంగా అంది.